ఇంటర్వ్యూ

ఏడుపు ముఖంతో మళ్ళీ వచ్చాడు నాదగ్గరకు మా రంగడు. "ఏం రా ఎక్కడన్నా ?" అని అడిగాను.

వాడు బిక్క మొఖంతో లేదన్నట్లు తలతిప్పుతూ పెదవి విరిచి, "ఎబ్బే ఎక్కడా దొరక లేదు" అన్నాడు. నిరాశతో కళ్ళనీళ్ళు పెట్టుకున్నట్టు కూడా అనుమానం వేసింది.

మా వాడ్ని పిలిచి దగ్గరకూర్చొపెట్టుకొని కాఫీ తెప్పించి ఇచ్చాను. పది నిమిషాలు గడిచింది. వాడే అన్నాడు. "ఏం బావా, మరి ఏం చేసేది ఇహ ?" అని.

వాడిని చూస్తే నాకు జాలి వేసింది. ఇప్పటికి నెల నుంచి ప్రయత్నం చేస్తున్నాడు ఉద్యోగం కోసం. ఎక్కడా లాభించలేదు.

రంగడు బి ఏ. ప్యాసు అయినాడు. బుద్ధిమంతుడు. వట్టి అమాయకుడు. వినయ విధేయతలకు, వాడ్ని చెప్పి ఇంకోర్ని చెప్పాలె. అయితే ఏం, ఎక్కడా దొరక లేదు ఉద్యోగం. మళ్ళీ ఈసారి కూడా ప్రయత్నంవ్యర్థం అయింది అనేసరికి నాకూ చాలాకష్టం వేసింది, ఎందుకంటే నేను ఈ

తఫా వాడికి ఒక మంచి ఉపాయంచెప్పి పంపాను. ఇంతకు వాడు నేను చెప్పినట్లు చేశాడో లేదో! చేసే ఉంటాడు. అయినా కనుక్కుందా మని అడిగాను. ఏంరా, అయితే నేను చెప్పినట్లు చేశావా?

"ఆ అక్షరాలా నీవు చెప్పినట్లుగా చేశాను."

"ఏం జేశావు చెప్పూ. ఎక్కడో లోపం జరిగి ఉంటుంది."

"ఏమీ లోపం జరగలేదు. చెపుతాను విను.

వెళ్ళానూ..."

"ఇంటికేనా?"

"ఆ, ఇంటికే వెళ్ళి..."

"చీటీ పంపావా?"

"అక్కర లేకపోయింది." ఆయన బైట వరాండా లోనే కూర్చుంటే, నేను వెళ్ళి కనబడి నమస్కారంచేశాను.

సరే. ఫరవాలేదు. తరువాత?"

ఆయన ఊరికెనే ఉన్నాడు. సిగరెట్టు తాగుతూ చాలా సరదాగా ఉన్నాడు."

"మంచి సమయంలోనే వెళ్ళా వన్నమాట!"

"ఆయన కూర్చోండి అని కుర్చీ చూపించి ఎందుకు వచ్చావు అన్నట్లు చూశాడు."

"చెప్పేశావా, ఉద్యోగానికని?"

"ఎందుకు చెపుతాను నీవు వద్దు అన్నావుగా?"

"సరే, ఏమన్నావూ?"

"నేను మీశాఖవాడినే అండి మీరు మనశాఖీయులు గదా అని ఒక్కసారి తమదర్శనం చేసుకొని వెడదామని వచ్చాను అన్నాను."

"బాగుంది. సరియైన దారినే నడిచావుకదా. అంతే?

ఆయన చాలా సంతోషించి మన శాఖీయులలో కొందరి పేర్లు అడిగాడు!

"అక్కడే పాచిక వేశావా?"

"వెయ్యక మానానా? ఆయన అడిగిన వాళ్ళంతా నాకు మేనత్త కొడుకులైనట్లు మాట్లాడాను"

"నేను చెప్పలేదురా! అదే మార్గంరా, ఆయన సంతోషించి ఉండాలె, ఏం?",

"సంతోషించకేం ? సంతోషించి, మనం అంతా బంధువులం అన్నమాట! మీరు రావడం బాగుంది. అంటూ కాఫీ కూడా ఇచ్చాడు."

ఇదంతా విని నేను విరగబడినవ్వాను. ఎట్లాగయినా శాఖాభిమానం పోదు ఎంత చదువుకొన్నా ! మావాడు నేను చెప్పిన పద్ధతిని చక్కగా అమలులో పెట్టినందుకు కూడా సంతోషించాను. అప్పుడు అడిగాను వాణ్ని "తరువాత సంగతి చెప్పవేం?" అని ! వాడు చెప్పాడు. "కాఫీ అయిన తరువాత ఇది మీ స్వగృహమే కండడీ !" అని అడిగాను.

"ఓరి ! అసాధ్యుడవే ! నీకు ఆ సంగతి తెలియనట్లు?"

"ఆ"

"అవునుగాని అపళంగా ఆ ఇల్లు బాగుందని మెచ్చుకోకపోయినావ్?".

"మెచ్చుకోకుండా ఊరకుంటానా ! లక్షగా మెచ్చుకొన్నాను,"

"ఏమన్నావూ ? ఏమిటి ! చెప్పూ" ?

"ఇల్లుమటుకు కుదిమట్టంగా చాలా బాగుందండీ" అన్నాను.

"ఆ వెధవకొంపను పట్టుకొని!" అని నేను నవ్వాను

"అది ఎల్లాంటి కొంప అయితేనేం! నేను అనాలిసిన రీతిని నేను అన్నాను మాంచి గాలి వస్తుందండి ఊర్రిబైట అయితే మటుకు ఏంకాని" అని.

నేను వాడి మాటకు అడ్డువచ్చి ఆ మాట ఎందుకు అన్నావురా? అన్నాను.

"అంటే ఏంతే! ఇట్లా అన్నాను. అసలు ఏమాత్రం జ్ఞానం ఉన్నవాడైనా ఇట్లాంటిప్రదేశంలోనే ఇల్లుకట్టుకుంటూ డండి పట్నంలోమురికికూపం" ఆయన నేనుఅన్నదిఅక్షరాలా నిజం అన్నట్లు తల ఊపి పైగా అన్నాడు నవ్వుతూ. "ఈబం దరు చూశారూ ఇది నరకంలోఒకభాగం" నేను అన్నాను. "అల్లాకాదండీ, నరకమే బందరులో ఒకభాగం అండీ" అని.

చాలా బాగాఅన్నావు అని నేను తల ఊపాను.

"ఈ చమత్కృతికి ఆయనచాలాసంతోషించి విరగ బడి నవ్వాడు, దాని తరువాత నేనే అన్నాను, ఈ గాలితిని బ్రతకొచ్చునండీ" అని.

మా వాడు బాగానే అన్నాడు. నిజం మాట అంతే, అక్కడ కూరగాయలూ అవీ ఏమీ దొరకవు, ఒక్క గాలే

వొంతుకుతుంది. నేను నవ్వుకొని "ఇంకా ఏమన్నావు ?" అని అడిగాను.

"ఇల్లు గాలివాటంలో ఉందనీ, కట్టటం మహాబాగుం దనీ, కిటికీలూ అవీ, పెద్దదమ్యాల లాగ కాక అంచక్కా కుదిమట్టంగా ఉన్నాయనీ, గదులు విశాలంగా లేకపోయినా ముద్దొస్తున్నాయనీ, ఇల్లు ఇనపపెట్టెలాగ ఘట్టిగా ఉందనీ నట్టింట్లో బంగారం పారేసుకొన్నా ఎక్కడికిపోదనీ, మొత్తం మీద ఇంట్లోలక్ష్మి తాండవమాడుతున్నదనీ, ఒక్కగుక్కలో అనేశాను.

"రైట్ ! ఇక నీకు ఉద్యోగం వచ్చితీరుతుంది ఇవ్వాళ కాకపోతే రేపైనా ఉద్యోగంసంపాదించటానికిగాని, సంపా దించిన ఉద్యోగాన్ని నిలబెట్టు కొంటానికి కాని, ముఖ్యంగా కావలసింది ఇట్లాంటి మనస్తత్వం" అన్నాను నేను మా వాడితో.

ఆలోచిస్తే మావాడు లాచా తెలివైన ఘటంలాగ కనబడుతున్నాడు. మనిషినికాస్త పొగడటం మంచిది. దాని వల్ల మనిషి మనకు సుముఖుడు అవుతాడు అన్నాను. అంతే. అంతకంటే నేను ఎక్కువగా చెప్పిందీలేదు. ఇదైనా స్వంత తెలివితేటలవల్ల ఊహించిందేమీ కాదు. డీన్ కాంర్నిజ్

అనే ఆయన హాటు ఇన్ ఫ్లుయన్సుపీపులు అనే పుస్తకంలో ఈ రహస్యాన్ని బైటపెట్టాడు. ఈ విషయాన్ని మావాడికి నేను కాస్త అందిస్తే వాడు అల్లుకుపోయినాడు. ఏం పోక! తెలివి తక్కువవాడా ఏమన్నా?

అసలు రహస్యం ఏమిటీ అంటే ప్రతి వాడూకూడా తన ఇల్లు అందమైనదనీ సహజంగా అనుకొంటాడు. ఒకడు తనను గురించి ఏమనుకొంటాడో, అదేమాట మనం అంటే అంత పట్టివ్వడు. ముఖస్తుతీ అనిపించుకోడు. నగ్నమైన సత్యాన్ని చెప్పినట్లైతే తోస్తుంది నల్లగా ఉన్నాడనుకోండి ఒక ఆయన. "నా మొఖం తగలెయ్య, కోతివిలాగ ఉంది నా మొఖం, ఈ మొఖం పెట్టుకొని తిరిగేకంటే చస్తే మేలు" అనుకోడు. నల్లగా ఉన్నమాట నిజమే. కాని అంతమాత్రం చేత నేనేమీ అంత పెద్ద అంద వికారినైపోలేదు. ఏదో సామాన్యపు మనిషిని" అనుకొంటాడు. కాబట్టి పొగడ్త అనేది, నిజం లాగున కనపడేటట్లు చేసి హోమియోపతిడోసు ఇస్తే తప్పకుండా మంచి సుగుణం ఇస్తుంది. ఇల్లాగ అనుకొంటూ ఏదో ఆలోచనలో పడి మాట్లాడకుండా ఉండేసరికి మా వాడు "ఏమిటి బావా, ఆలోచిస్తున్నావు?" అన్నాడు "ఏం లేదులే దానితరువాత ఏం జరిగింది చెప్పూ!" అన్నాను.

"ఇల్లు బాగుండన్నా కాదూ. అందుకని ఆయన నన్ను లోపలికి తీసికెళ్ళి, ఇల్లంతా చూపెట్టాడు. అంత పెద్ద జీతగాడు కదా ఆయన, ఇల్లు అంత అసహ్యంగా ఉందేం? అంత దరిద్రపు కొంప నే నెక్కడా చూడలేదు పది సంవత్స రాల క్రితం గోడలకు సున్నంగొట్టి ఉంటాడు జేనెడు, జేనెడు గదులు! ఇంటినిండా మాసిన బట్టలు. గోడలకు పగిలిపోయిన ఫోటోలు!

"అయితే నీ వేమన్నా తెలివితక్కువగా......"

"అహా హా హా! అంత తెలివితక్కువగా ఏమీ అన లేదు. ఆయనే అన్నాడు. "నేను ఎంత మొత్తుకొన్నా లాభం లేదండి. మా ఆవిడకు ఇల్లు శుభ్రంగా ఉంచాలన్న గొడవే తెలియదు. "అప్పుడు నే నన్నాను నవ్వుతూ. దానికేంలెండి. పిల్లలుగల ఇల్లు ఎల్లాగుంటుంది మరి? ఎంత మంది నౌకర్లు ఉన్నా పిల్లలుగల ఇల్లు ఇంతేనండి! ఆయన సంతోషించి నాతో గర్వంగా అన్నాడూ, నేను ఆఫీసు ప్యూనును ఇంటికి రమ్మనను, వాళ్ళచేత పని చేయించు కోను, అని. ఆ మాట విని నేను. అంత విచిత్రమైనటువంటి పనిచేయుట కంటే మరొక ఘనకార్యం ఈ ప్రపంచంలో మరొకటి లేదు, అని అనుకొన్నట్లు చూశాను."

మావాడు చెప్పిన ఈ మాటలన్నీ విని నేను చాలా సంతోషించాను. నేను సూత్రప్రాయంగా చెప్పిన విషయా లన్నీ మావాడు చక్కగా ఆచరణలో పెట్టాడు. ఇల్లాంటి శిష్యులను ఇద్దరిని తయారుచేస్తే నేను లోకాన్ని కొంత బాగుచేసినట్లే! ఇల్లాగ అనుకొని వాడి వంక చూశాను. మిగిలిన విషయం చెప్పమన్నట్లు. వాడు ఇల్లాగ చెప్పాడు.

"ఇల్లంతా చూచి మేమిద్దరం బైటికివచ్చేశాం బావా! వాళ్ళ వాకిట్లో ఒక కుక్క కనపడ్డది. దాన్ని దగ్గరకు పిలి చాను. అదివచ్చి ముందు కాళ్ళు రెండూ ఎత్తి నా మోకాళ్ళ మీద ఆనించింది. ఆ కుక్కను చూస్తే నాకు అసహ్యం వేసింది."

"అయినాఆకుక్కను నీవు మెచ్చుకొన్నావు కాదూ!" అని అడిగాను:

"తప్పుతుందా మరి! మెచ్చుకొంటూన్నట్లు కనపడ కుండా మెచ్చుకొన్నాను. 'ఇది కరవరావటం లేదండీ! కొన్ని కుక్కలు కొత్తమనిషిని చూస్తే తెగ మొరుగుతై! అన్నాను. ఆయన ఇహ ఒక అరగంటసేపు ఆ కుక్క సుగుణాలను గురించి చెప్పాడు. దానికి పెద్దమనుష్యులు ఎవరైంది తెలుసు నట. వాసనచూసే కనుక్కుంటుందట. ఇంతకూ అది నన్ను

జూచి అరవక పోవటం ఒక గొప్ప అదృష్టం. అది అరచి ఉన్నట్లయితే నన్ను దొంగక్రింద కట్టేశేవాడు ఆయన. ఆఫీసర్లకు తమ కుక్కల యొక్క, ప్యూనుల యొక్క శక్తి సామర్థ్యాలలోను సత్యసంధతలోనూ, ఉన్న గట్టి నమ్మకం భగవంతుడి యందు సహితం ఉండదు. ఆ కుక్క అరవక పోవటం మూలాన నేను బ్రతికిపోయినాను. ఆయన నన్ను మర్యాద చేశాడు. భోజనానికికూడా ఉండమంటాడు అనుకొన్నాను గాని అనలేదు; "ఇంకోసారి రండి మాట్లాడుదాము; ఇప్పుడు కొంచెం పనిమీద వెళ్ళాలె" అని అంటూ నన్ను సాగనంపుతూ ఆయన వరండా మెట్లుదిగాడు. అప్పుడు, ఒక చిన్న పిల్ల అరేండ్లది, ఒక మాసినచొక్కా వేసుకొని. మెల్లెక్కుతున్నది. దాన్ని చూసేసరికి నీవు చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది; పిల్లలనుకూడా మెచ్చుకో వలెననీ, తండ్రికి తన పిల్లలనుచూచి, ఇతరులు ఆనందించాలని ఉంటుందనీ నీవు చెప్పావు; అందుకని చప్పున ఆ పిల్లను ఎత్తుకొని బుగ్గగిల్లి ముద్దాడి, అంతకుముందే జాగ్రత్తపడి జేబులో వేసుకొని పోయిన పిప్పరమెంటు బిళ్ళలను రెండు చేతులలో పెట్టాను.

"రైట్—చాలా బాగాచేశావు; ఇంకా నీకు దిగులు వద్దు. అయితే ఆ పిల్లను ఎత్తుకొని ముద్దాడావుగదా,

అప్పుడే అనకపోయినావు పిల్ల అంచక్క మద్దొస్తూఉందనో, ఏవో అల్లాంటిమాటలు !

అనక ఊరుకుంటానా బావా! పిల్లవంక జూచి నవ్వుతూ, అంతా మీ రూపేనండి; ముక్కు మీ ముక్కు! నోరు మీ నోరు! కళ్ళు మీ కళ్ళు! నవ్వితే అంతా మీరు నవ్వినట్లేఉంది! ఆడపిల్లలకు తండ్రి రూపు రావటం చాలా అదృష్టమండీ అనీ, తమ కెంతమందండీ సంతానం? అని అడిగేను. ఆయన లోపల విచారం పెట్టుకొని, పైకి నవ్వుతూ నాకు పిల్లలు లేరండీ! అన్నాడు; ఇట్లా చెప్పి మావాడు విచారంగా చూశాడు.

నాకు చాలా కష్టంవేసింది; మావాడు అద్భుతమైన ప్రవర్తన అంతా వృథా అయిపోయింది; వృథా అయిపోవటమే కాకుండా ఎవరి పిల్లనో పట్టుకొని, వీడు అంతా మీ రూపేనండి అని అనటంలో, వాడు అబద్ధాలు ముఖప్రీతి మాటలూ, అంటున్నాడని తేలిపోయింది; ఇల్లా అనుకుంటూ చాలాసేపు విచారపడి చివరకు అన్నాను—పొరపాటు అయిపోయిందిసుమీ! ఆ ఒక్కమాటా అనకుండా ఉండాలిసింది.

"ఎట్లాఅనకుండా ఉండేది బావా! ఆ పిల్ల నిజంగా ఆయన రూపు నే ఉన్నట్లు కనపడ్డది" అన్నాడు మావాడు

"దానికేంలే, మనము ఎల్లాగ అనుకొంటే అల్లాగ కనపడుతుంది. ఒక్క పని చేయాలిసింది ఆయనకు పిల్లలు ఉన్నదీ లేనిదీ నేవు ముందుగా విచారించవలసింది! సరేవం జేస్తాము? ఆయన నాకు పిల్లలు లేరు అన్నప్పుడు నీ వేమ న్నావూ?

"అంత పోలిక ఉండుట మూలాన, ఈ పిల్ల మీా తమ్ముడి కూతురా అండి, అని అడిగాను చప్పున!"

భేష్—అతికి పోయింది బ్రతికిపోయినావు. తమ్ముడి కూతురు ఆయన పోలికలో ఉండటం ఆశ్చర్యం లేదు. కాబట్టి, నీవు అబద్ధాలు ఆడుతున్నావని అనుకోంటానికి ఆయనకు అవకాశం లేదు—బాగా తోచిందిరా నీకూ.!" అని మెచ్చుకొన్నాను.

మావాడు బిక్కముఖంపెట్టి మళ్ళీ అన్నాడు. "కాని ఆయన "అవును" అంటే బాగుండేది?"

"ఆఁ అనకా?"

'తెల్లముఖం వేశాడు!'

"వేసీ?"

"మా ఇంట్లో పనిచేసేదాని కూతురు ఆ పిల్ల! అన్నాడు!

నేను నిలువునా నీరై పోయినాను. ఏమీ తోచక తర్వాత సంగతి ఏమిటి అన్న అర్థంలో అ అ ఆఁ ???? అన్నాను.

"ఇంకా ఆఁ ఏమిటి నా బొంద! ఆఁ లేదూ! ఊఁ లేదూ! ఆవళంగా వచ్చేశాను" అని విసుక్కున్నాడు.

సమాప్తము.